క్లుప్తంగా

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



మంగళగిరి: ప్రస్తుత ఆధునిక కాలంలో ఎలాంటి ఉద్యోగాలు పొందాలన్నా సాంకేతిక విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని కేఎల్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుమన్ సూచించారు. వర్సిటీ ఈసీఈ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండలంలోని దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రాథమిక అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా పయనించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు పది, ఇంటర్ తర్వాత సాంకేతిక విద్యనభ్యసించటం వలన త్వరగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేగవంతంగా నైపుణ్య గణన సర్వే

కమిషనర్ అలీంబాషా



మంగళగిరి: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నైపుణ్య గణన సర్వే వేగవంతం చేసినట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా బుధవారం తెలిపారు. సర్వేను సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభించినట్లు వివరించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాల నమోదుకు ఆధార్ కార్డు ఓటీపీ చెప్పడానికి ఎవరు సందేహపడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం యాప్‌లో నమోదు చేసిన వివరాలను నిర్ధారించడానికే ఓటీపీ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో 15 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగులు, సెల్ఫ్ ఎంప్లాయిస్, ఉద్యోగుల వివరాలను నైపుణ్య గణన సర్వేలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ జి.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఇప్పటం రోడ్డు, ఇందిరానగర్, ఎల్‌బీ నగర్, క్యాంప్ గేట్ రోడ్డు, ద్వారకానగర్‌లలో కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మునగపాడు రోడ్డుకు నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: మునగపాడు–గుండాలపాడు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ జిల్లా పర్యవేక్షణాధికారి జి.బ్రహ్మయ్య బుధవారం వెల్లడించారు. మండలంలోని మునగపాడు, గుండాలపాడు రోడ్లు అధ్వానంగా ఉన్న విషయంపై ఈనెల 15న సాక్షిలో పల్లెల ప్రయాణం నరక ప్రాయం అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా రైల్వేస్టేషన్ నుంచి గుండాలపాడు వయా బేతపూడి వెళ్లే రోడ్డు స్వర్ణ ఆంధ్ర– 2047 కార్యాచరణ ప్రణాళికలో ప్రతిపాదన చేశారని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన తరువాత రోడ్డు పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

లాంలో కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

లాం(తాడికొండ): బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామంలో జరిగింది. వివరాలు.. ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన నడిచే బస్సు గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తుండగా లాం చలపతి పాఠశాల సమీపంలో మరో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గుంటూరుకు చెందిన షేక్ ఖాసింకు స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవింగ్‌లో ఖాసిం అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పిందని, లేకుంటే తనతో పాటు కుటుంబ సభ్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.


గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

తాడికొండ: గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన మద్రిపూడి మురళీకృష్ణ(34) మంగళవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి మద్రిపూడి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఆశాజనకంగా పంటలు



ఏపుగా పెరిగిన పత్తి పంట



వర్షాలకు కళకళలాడుతున్న మిర్చి పైరు

తాడికొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాణిజ్య పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మూడు రోజులుగా అరకొరగా చిరుజల్లులు కురిసి పంటలకు నీరందించడంతో రైతులకు ముప్పు తప్పినట్లయింది. పత్తి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది, మిర్చి నారును పొలంలో నాటి 20 రోజులు కావస్తుండటంతో వర్షాలు మొక్క నాటుకునేందుకు అనుకూలించిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మినుము 10–15 రోజుల పైరు కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నదాతలు చెబుతున్నారు.

పంచాయతీలలో వసతులు కల్పించేందుకు కృషి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



మోతడకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

తాడికొండ: గ్రామ పంచాయతీలలో అన్ని వసతులు కల్పించే ప్రణాళికతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని మోతడకలో పల్లె పండుగ బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్లతో 160 పనులు అన్ని గ్రామ ప్రాంతాల్లో చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఉపాధి హామీ నిధులతోనే కాకుండా 15వ ఆర్థిక ప్రణాళికా నిధులతో కూడా అన్ని అభివృద్ధి పనులు గ్రామాల్లో చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. మోతడకలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులతో పాటు గోదాము మరమ్మతులు చేసి ప్రారంభించుకోవడం హర్షణీయమన్నారు. ఆగస్టు 23వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ముఖ్య పనులు ఆమోదించడం జరిగిందని, అందులో భాగంగా శంకుస్థాపన చేసిన పనులను సంక్రాంతి లోగా పూర్తి చేయనున్నట్లు వివరించారు. గ్రామ సర్పంచి, వార్డు మెంబర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు కలిసికట్టుగా ధృఢ సంకల్పంతో పనులు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను పునరుజ్జీవింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, తుళ్ళూరు మండలాలకు రూ.75 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయ చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వి.శంకర్, తహసీల్దార్ నాసరయ్య, ఎంపీడీఓ సమతా వాణి, సర్పంచి యడ్లపల్లి పార్వతి, ఎంపీటీసీ కంచర్ల సాంబశివరావు, టీడీపీ నాయకులు కంచర్ల శివరామయ్య, తలశిల ప్రసన్న, సాంబశివరావు, జనసేన నాయకులు విజయ శేఖర్ పాల్గొన్నారు.

కార్మికులకు నష్టపరిహారం, బకాయిలు చెల్లించాలి

తహసీల్దారుకు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణా సిమెంట్ కంపెనీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

తాడేపల్లిరూరల్: సిమెంట్ కంపెనీ కార్మికుల నష్టపరిహారం, వేతన బకాయిలు హైకోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి చెల్లించాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారాంప్రసాద్‌కు కృష్ణా సిమెంట్ కంపెనీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి స్టీవెన్ వినతి పత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ 1993 మే 29వ తేదీన తాడేపల్లి ఏసీసీ సిమెంట్ కంపెనీ ఆనాటి యాజమాన్యం ఫ్యాక్టరీని లాకౌట్ చేసిందని, నాటి నుంచి నేటి వరకు యూనియన్, కార్మికులు అనేకసార్లు యజమానులను, ప్రభుత్వ అధికారులను కలసి నష్టపరిహారం గురించి విన్నవించినా ఫలితం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు న్యాయం కోసం సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. సదరు కోర్టుల వారు 2015లో ఏసీసీ కంపెనీ భూములను అమ్మి కార్మికులకు బకాయిలు చెల్లించమని, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిందని, కానీ ఇప్పటి వరకు అమలు కాలేదని వివరించారు. ఇప్పటి వరకు 150కి పైగా కార్మికులు మానసిక ఆందోళన, అనారోగ్య కారణలతో మరణించారని అయినా కార్మికులకు నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. ప్రస్తుతం కంపెనీ వారి భూములు ప్రైవేటు వ్యక్తులకు అనధికారికంగా అమ్మకం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు వారి ఆదేశాల ప్రకారం కార్మికులకు నష్టపరిహారం చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్కే బాషా, ఎస్కే సుభాని, ఎం.ఆశీర్వాదం, ఎ.నాగేశ్వరరావు ఉన్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం



మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 167 మందికి డాక్టర్ శాంతి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు చేతులు శుభ్రత, రక్తహీనత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, మేల్‌అసిస్టెంట్ బాబావలి పాల్గొన్నారు.
మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం కమల్‌మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడుగుకోవాల ని చెప్పారు. ఇంటిలోని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఉండే కరణం అమర్‌చంద్, జనార్దనరావు హోటల్‌లో కార్మికులుగా పని చేస్తుంటారు. ఇటీవల మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణపడగా జనార్దనరావు అమర్‌చంద్‌ను నెట్టడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ 6వ తేదీన మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. హోటల్ నిర్వాహకుల వద్ద నిందితుడి వివరాలు లేకపోవడంతో విచారణ ఆలస్యమైందని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

బస్సు ఢీకొని ప్రొఫెసర్ మృతి

మంగళగిరి: బస్సు ఢీకొని ప్రొఫెసర్ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నొయిడాకు చెందిన ప్రకాష్ కుమార్(32) ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. నిడమర్రులో నివాసముంటూ వర్సిటీకి వెళ్లి విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా వర్సిటీకి చెందిన బస్సు వెనుక నుంచి ఢీ కొనడంతో రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడుని ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడుకి భార్య, ఒక పాప ఉన్నారు. ప్రొఫెసర్ సతీమణి రిమి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మంగళగిరి: స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై స్వర్ణకార సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్వర్ణకార కార్పొరేషన్‌కు ఆమోదం తెలపడం హర్షణీయమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు షరాఫ్ బజార్‌లోని సంఘం కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

నేడు నృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఎగువ దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

పార్కింగ్‌లో ఉన్న బైక్ చోరీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన విద్యార్థి సయ్యద్ అబ్దుల్ కొలనుకొండలో ఉండి స్థానికంగా ఉన్న యూనివర్సిటీలో చదువుతున్నాడు. దసరా సెలవుల సందర్భంగా ఈనెల 5వ తేదీన తాను నివాసముంటున్న అయ్యప్ప నిలయం వద్ద సయ్యద్ అబ్దుల్ తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి కంభం వెళ్లాడు. సెలవులు ముగిసిన అనంతరం 15వ తేదీ వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల విచారించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వెల్డర్ మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం 16వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వెల్డింగ్ పని చేసుకునే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. తాడికొండ గ్రామానికి చెందిన ఎస్కే మస్తాన్ వలి(50) అదే గ్రామంలో వెల్డింగ్ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి విజయవాడ నుంచి జాతీయ రహదారి మీదుగా గుంటూరుకు వైపు వెళుతుండగా వడ్డేశ్వరం వద్ద ఆగిఉన్న టిప్పర్ లారీని గుద్దడంతో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్ మృతిపై కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించామని శ్రీనివాస్ తెలిపారు. మృతి చెందిన మస్తాన్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం చేశాడు.

పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి

తాడేపల్లిరూరల్: పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రామారావు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 102, 106 ప్రకారం ప్రతి నెల ఒక గ్రామంలో నిర్వహించాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆయన చెప్పారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి



కార్యకర్తలతో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దుగ్గిరాల మండలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం కలిశారు. వేమారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్నారని చెప్పారు. గత ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకపోగా వీధి వీధిన మద్యం పారించేందుకు మాత్రం టెండర్లు పిలిచిందన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే పెన్షన్, రేషన్‌తో సంక్షేమ పథకాలను అందిస్తే ఈ ప్రభుత్వం మాత్రం ఇంటింటికి మద్యం అనే పథకాన్ని అమలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి రమేష్, కొండేటి రాజేష్,ముదునూరి అనిల్ కుమార్, కొందూరు రమేష్, కొండేటి కుమార్ పాల్గొన్నారు.

22న వ్యవసాయ రంగ సమస్యలపై సదస్సు

ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శివశంకరరావు



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యలపై ఈనెల 22వ తేదీ విజయవాడలో సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్ ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్, ఏఐకేఎస్‌ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి విజు కృష్ణ, విద్యుత్ రంగం నిపుణులు డాక్టర్ కె.అశోక్‌రావు, ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ సమావేశానికి హాజరు కానున్నారని చెప్పారు. కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రుణ విమోచన చట్టం అమలు, మద్దతు ధరల చట్టం ఆవశ్యకత, విద్యుత్ రంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న సంస్కరణలు వాటి ప్రభావం రైతాంగంపై ఏ విధంగా ఉండనుంది, సాగునీటి రంగంలో ప్రాజెక్టు నిర్మాణం, వరదల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, సమగ్ర పంట బీమా ఆవశ్యకత, వరదల పంట నష్టపరిహారం పెంపు, రైతుల రుణమాఫీ, ఐక్య ఉద్యమాల ప్రాధాన్య వంటి వివిధ అంశాలపై వక్తలు ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు రైతులు, కౌలు రైతులు, తప్పని సరిగా హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ కార్యదర్శి దాసరి గణేష్, రాజధాని రైతు సంఘం అధ్యక్షులు జె.జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు గైరుబోయిన నాగేశ్వరరావు, అత్తలూరి వీర వెంకయ్య, తక్కెళ్ళపాటి భక్తిరెడ్డి, దండమూడి సాంబశివరావు, గాంధీ రామారావు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తాం



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనకు ఆర్థిక సహాయం అందజేయాలని మంగళగిరి రూరల్ రేవేంద్రపాడుకు చెందిన పి.సాంబశివరావు వినతిపత్రం అందజేశాడు. కుంచనపల్లికి చెందిన బి.కృపారావు తాను పక్షవాతంతో బాధపడుతున్నాని తనకు సామాజిక పెన్షన్ ఇప్పించాలని వినతిప్రతం అందజేయగా, నులకపేటకు చెందిన పెద్దిరాజు తన కుమారుడు ఇంజినీరింగ్ చదివాడని ఉద్యోగ అవకాశం కల్పించలని విజ్ఞప్తి చేశాడు.

హైకోర్టు న్యాయవాదికి డాక్టరేట్



కోటేశ్వరరావు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడుకు చెందిన మల్లాడి కోటేశ్వరరావు హైకోర్టులో అడ్వకేట్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగానికి చెందిన రిసెర్చ్‌స్కాలర్ మల్లాడి కోటేశ్వరరావు సమర్పించిన సోషల్ సెక్యూరిటీ ఫర్ అగ్రికల్చరల్ వర్కర్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ విత్ రిఫరెన్స్‌టూ సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ అండ్ ఎంజీఎన్ఆర్ఈ జియాక్ట్ 2005 థీసెస్‌కుగాను యూనివర్సిటీ పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్(లాడిపార్ట్‌మెంట్) నుంచి పీహెచ్‌డీ అవార్డు పొందినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ బుధవారం తెలిపారు. రీసెర్చ్ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ గౌరి సునీత స్కూల్ ఆఫ్ లా, నవీత చైన్నై పర్యవేక్షణలో మల్లాడి కోటేశ్వరరావు పీహెచ్‌డీ పట్టాపొందారన్నారు. ప్రస్తుతం కోటేశ్వరరావు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారని చెప్పారు. తమ గ్రామానికి చెందిన కోటేశ్వరరావుకు పీహెచ్‌డీ రావడంపై గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆళ్ల కృష్ణమూర్తి, జిల్లా సర్పంచుల సంఘం కార్యదర్శి కె.పెదబాబు, కె.కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కె.ప్రసాద్, సర్పంచ్ కె.దాసయ్యలు అభినందనలు తెలిపారు.

నరకయాతన



పొన్నెకల్లు- దామరపల్లి మధ్య ఏర్పడిన భారీ గుంతలు

తాడికొండ: మండలంలో పొన్నెకల్లు– దామరపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. అడుగుకో గుంత పడడంతో ముందుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఈ రోడ్డులో మండల కేంద్రానికి ప్రతి రోజు ఫణిదరం, గరికపాడు, బండారుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే రోడ్డుపై భారీగా ఏర్పడిన గుంతలు ద్విచక్ర వాహనాలు మినహా ఆటో, కారు మరే ఇతర వాహనాలు వెళ్లలేనంతగా ఏర్పడటంతో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది.

గోతులమయం



తెనాలి రోడ్డు ఫ్లైఓవర్ వద్ద గోతులు మయంగా మారిన రోడ్డు



నిడమర్రు రోడ్డులో గోతులు..



ఎన్ఆర్ఐ వద్ద గోతులమయం

మంగళగిరి: నగరంలో రోడ్లు నరకప్రాయంగా మారాయి. అడుగడుకో గుంత ప్రజలను కలవరపెడుతున్నాయి. వర్షం పడిన సమయంలో గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళగిరి– తెనాలి రోడ్డు ఫ్లైఓవర్ వద్ద గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిడమర్రు రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద కల గోతిలో బైక్‌తో సహా పడి గాయాలపాలైన ఘటన చోటు చేసుకుంది. గ్రావెల్ రోడ్లు , మట్టి రోడ్లు గోతులు కారణంగా రైతులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు కనీసం గోతులు పూడ్చే యత్నం చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.